క్లుప్తంగా

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: బాల్య వివాహాలను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గిరిజా కాలనీలో బాల్య వివాహాలపై మంగళవారం సదస్సు, ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు.

1006వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు దేశ ప్రజల సొత్తు అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో 1006వ రోజు సంస్థకు చెందిన సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: కార్తీక మాసోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 77వ వార్డు అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపం వెలిగించారు. అర్చకుడు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముత్తి అమ్మోరు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు..

అక్కిరెడ్డిపాలెం: ఇంటి నుంచి పారిపోయిన యువకుడిని తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు పోలీసులు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డులో నివాసం ఉంటున్న సయ్యద్ ఇబ్రహీం (17) అనే యువకుడు జ్యూస్ షాప్ నిర్వహించుకుంటున్న తన తల్లిదండ్రులతో నివసిస్తున్నాడు. ఇబ్రహీం తల్లిదండ్రులు నిత్యం చదువుకోమని ఒత్తిడి చేస్తుండటంతో, అతడు ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. దీంతో యువకుడి తల్లిదండ్రులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూలై 10వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇబ్రహీం ముంబయిలో ఉన్నాడని గుర్తించి, అతడిని పట్టుకుని మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించిన విశాఖ, గాజువాక పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి


ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కూర్మన్నపాలెం: ప్రజలు మధుమేహం విషయంలో అప్రమత్తంగా ఉండాలని కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి సూచించారు. వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ సభ్యులు కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి దువ్వాడ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మధుమేహంపై ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యుల అభ్యర్థన మేరకు గ్రీన్‌లాండ్ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన ఏపీఎస్ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సుబ్బరాజు, సూర్యనారాయణ, ప్రసాద్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

● **అగనంపూడి:** అగనంపూడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పినమడక నిర్వాసిత కాలనీలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్లు కిడిమి హనుమంతురావు, సుశీలా గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో మార్పు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


గృహసారథులకు బుక్‌లెట్లు అందజేస్తున్న దేవన్‌రెడ్డి


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో ఎంతో మార్పు తెచ్చాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందువల్లే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని, జగనన్న పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. జీవీఎంసీ 64వ వార్డు దిబ్బపాలెం సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో మహిళలు, విద్యార్థులు, కార్మికులు, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. ప్రతీ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నే మళ్లీ సీఎంగా రావాలని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని 65వ వార్డు బాపూజీ కాలనీ సచివాలయ పరిధిలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమం అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన, వైఎస్సార్‌సీపీ పాలనపై పది ప్రశ్నలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఎండీ గౌస్, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు లోకనాథం, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

- వాటిని సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులకు అతిథుల సూచనలు
- వేడుకగా ప్రారంభమైన వారోత్సవాలు


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు


గాజువాక శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు

గాజువాక: గ్రంథాలయ వారోత్సవాలు గాజువాక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అతిథులు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో వివిధ పోటీలను నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు పోటీలు నిర్వహించి, విజేతలకు 20న బహుమతులను అందజేస్తామన్నారు.

● ఈ నెల 15న హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేదరికం-నిర్మూలన అంశంపై జూనియర్స్ విభాగంలో, చంద్రయాన్ ల్యాండింగ్‌పై సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

● గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 16న కవిసమ్మేళనం నిర్వహించనున్నారు. ● ఈ నెల 17న ప్రాథమిక తరగతుల విద్యార్థులకు డిపాజిట్ సేకరణ, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తామన్నారు.

● 18న గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, యువతకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నారు.

● 19న మహిళలకు, బాలబాలికలకు డిబేట్, మ్యూజికల్ చైర్ పోటీలు ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాలతో బహుళ ప్రయోజనాలు

గ్రంథాలయాలతో బహుళ ప్రయోజనాలున్నాయని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, సాహితీవేత్త అద్దంకి రాఘవాచార్యులు, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ, సాహిత్య సుధ వ్యవస్థాపకుడు రాఘవాచార్యులు, కార్పొరేటర్ రామారావు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- అగనంపూడి హైస్కూల్లో సైకిల్ స్టాండ్ ప్రారంభం


సైకిల్‌స్టాండ్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో అగనంపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓ పక్క ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలకు కార్పొరేట్ హంగులు సమకూర్చుతుండగా.. మరోపక్క విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. లక్షా 75వేల రూపాయలతో విద్యార్థుల సైకిల్ స్టాండ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాత పూర్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు సైకిల్‌స్టాండ్ ఏర్పాటుకు హామీ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభించి, బాలల దినోత్సవం నాటికి పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. పూర్ణానందశర్మను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ అధ్యక్షుడు వాడపల్లి రామచంద్రరాజు, నాయకులు పాల్గొన్నారు.

నెహ్రూకు నివాళి


ఉక్కులో నెహ్రూకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నివాళి అర్పించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్థానిక నెహ్రూపార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ నెహ్రూ హయాంలో అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడానికి పూనుకుందని, పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, కె.దాలినాయుడు, డి.పుల్లారావు, హెచ్ఎంఎస్ నాయకుడు డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ స్థలం పరిశీలన


దువ్వాడ రైల్వేస్టేషన్ పరిశీలిస్తున్న ఎంపీ జీవీఎల్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి స్థలాన్ని ఎంపీ జీవీఎల్ నర్సింహారావు మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నమూనాను పరిశీలించారు. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థలాలు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఎంపీకి వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకుడు కె.నర్సింగరావు, ఈఎస్ఐ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

దువ్వాడ స్టేషన్ పరిశీలన

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌ను ఎంపీ జీవీఎల్ పరిశీలించారు. పునరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టనున్న పనులను రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్‌ఫాంల విస్తరణ, రైల్వే స్థలం ఏ మేరకు ఉంది, అభివృద్ధికి ఏమైనా ఆటంకాలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు సమీపంలోని తలారివానిపాలెం ఇరుకు వంతెనను పరిశీలించారు. రైల్వే మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. నాగావళి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణపై దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. స్టేషన్ మేనేజర్ ఎస్.ఆర్.కె.రావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మాధురి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో నిత్యాన్న సమారాధన


షీలానగర్ ఆలయంలో దీక్షధారులకు అన్నప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో దీక్షధారులకు మండలకాలం అన్నసమారాధనను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ముందుగా ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 26వ తేదీ వరకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దివంగత తిప్పల చినఅప్పారావు, అరుణ దంపతుల కుమారులు తిప్పల నితీష్‌రెడ్డి, సతీష్ రెడ్డి తొలిరోజు అన్నసమారాధనకు రూ.36 వేలు ఆర్థిక సహకారం అందించారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు, గురుస్వామి అదపాక వెంకటరమణ మాట్లాడుతూ 21 సంవత్సరాలుగా సేవా సంఘం కార్తీక మండల కాలంలో ఆలయంలో నిత్య అన్నసమారాధనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు ధర్మాల శ్రీను, గాజువాక మండల అధ్యక్షుడు బుద్దా గోవింద్, సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డీపీఎస్‌ను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్

మరోసారి ఫిర్యాదు వస్తే శాఖాపరమైన చర్యలకు ఆదేశం


విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

ఉక్కునగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు స్టీల్‌ప్లాంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)ను సందర్శించారు. పాఠశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో చైర్మన్ మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో పాఠశాలకు విచ్చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అందించాలని సూచించారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవన్నారు. మరోసారి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రిన్సిపాల్ తీరుపై చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, డీఈవో చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సిబ్బంది బి.మమత తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి


నూతన డైరెక్టర్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (పర్సనల్)గా ఎంపికైన జి.వి.ఎన్. ప్రసాద్ అన్నారు. నూతన డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు మంగళవారం ప్రసాద్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, త్వరలో ప్లాంట్ లాభాల్లోకి వస్తుందని అన్నారు. యూనియన ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ చార్జిమన్‌గా ప్లాంట్‌లో ప్రయాణం ప్రారంభించి డైరెక్టర్ స్థాయికి ఎదగడం తెలుగువారికి గర్వకారణమన్నారు. రానున్న కాలంలో మార్కెటింగ్‌ను కొత్త పుంతలు తొక్కించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటరమణ, ఎం.పరదేశి, కె.దాలినాయుడు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, పుల్లారావు, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం
- ప్రజా రక్షణభేరికి బైక్ ర్యాలీ


కూర్మన్నపాలెం కూడలిలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఉక్కు నిర్వాసితురాలు బొద్ద వెంకయ్యమ్మ

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు స్టీల్‌ప్లాంట్ నుంచి పోరాట కమిటీ కార్యకర్తలు, కార్మికులు కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరం నుంచి బైక్‌లపై ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ముందుగా కూర్మన్నపాలెం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉక్కు నిర్వాసితురాలు బొద్ద వెంకయ్యమ్మ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధి సురేష్‌బాబు, స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి, సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరాజు, ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, వైటీ దాస్, నమ్మి రమణ, కె.ఎస్.ఎన్.రావు, కారు రమణ, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బాలల చేతిలోనే దేశ భవిత

- వారి హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత
- పునరుద్ఘాటించిన వక్తలు
- పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మెజిస్ట్రేట్ శ్రీలక్ష్మి


ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులకు స్టేషనరీ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


కణితి హైస్కూల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం అరుణకుమారి


వేడుకల్లో పాల్గొన్న కణితి పాఠశాల విద్యార్థులు


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం


గాజువాక హైస్కూల్‌లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గాజువాక: బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

● గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, ఉపాధ్యాయులు జనార్ధన్, భావనారుషి పాల్గొన్నారు.

● స్థానిక ట్వింకిల్ కిడ్స్ స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు రైజ్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ అవినాష్, డాక్టర్ నళిని చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి పాల్గొన్నారు.

● చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్‌లో ఫ్యాన్సీ డ్రెస్ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన మ్యాజిక్ షో అలరించింది. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ పి.భాస్కరరావు, ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

చినగంట్యాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్ నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులను పంపిణీ చేశారు. టీచర్ కమర్ జహాన్, రిటైర్డ్ హెచ్ఎం బాపయ్య పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన

పెదగంట్యాడ: బాలల హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని గాజువాక 8వ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల చట్టాల గురించి మేజిస్ట్రేట్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి, న్యూపోర్టు సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ మన్మథరావు, పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, బీవీఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

75వ వార్డు దుర్గవానిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చిన్నారులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్ భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో..

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి చేతులమీదుగా బహుమతులు అందించారు. ఆమె మాట్లాడుతూ నేటి బాలలు అపారమైన విద్యాజ్ఞానాన్ని సంపాదించి భవిష్యత్తులో దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులు ప్రదర్శించిన జానపద నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

అగనంపూడి: స్థానిక పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో అగనంపూడి పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు స్టేషనరీ అందించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. 85, 79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, దొడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ హైస్కూల్‌లో బాలబాలికల వేషధారణలు, నృత్యాలు అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు కో-ఆర్డినేటర్ టి.ఎల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ షాజి జోసఫ్, ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గురునాథ్ యాదవ్‌కు ఘనస్వాగతం


గాజువాక చేరుకున్న గురునాథ్ యాత్ర

గాజువాక: 2024లో జగన్ మోహన్ రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.గురునాథ్ యాదవ్ టెక్కలి నుంచి తిరుపతి దేవస్థానం వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం గాజువాకకు చేరింది. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి అప్పారావు పాతగాజువాకలో ఘనస్వాగతం పలికారు. గురునాథ్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయనతో కలిసి కొంతదూరం పాదయాత్రలో పాల్గొన్నారు.